క్లుప్తంగా

ఎండుతున్న మొక్కలు!



ఆసిఫాబాద్‌అర్బన్: వన మహోత్సవంలో భాగంగా మండలంలోని మోతుగూడ గ్రామంలో నర్సరీ నుంచి నాటేందుకు తీసుకొచ్చిన మొక్కలు జీపీ కార్యాలయంలో నిర్వహణ లోపంతో ఎండిపోతున్నాయి. లక్షల రూపాయలు ఖర్చు చేసి పెంచిన మొక్కలు అధికారుల నిర్లక్ష్యంతో వృథాగా పడి ఉన్నాయి. ప్రభుత్వ ఆదేశాలను కొందరు అధికారులు నిర్లక్ష్యం చేస్తూ ప్రభుత్వ ధనాన్ని వృధా చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

మూత్రశాలలు @ స్టోర్‌రూం



టైర్లు, చెత్తతో నిండిన మూత్రశాల గది

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ మున్సిపాలిటీ కార్యాలయంలోని మూత్రశాలలు స్టోర్‌రూంల తయారయ్యాయి. కార్యాలయంలో నిరుపయోగంగా ఉన్న వాహనాల టైర్లు, చెత్తపేపర్లు, పాడైపోయిన వాహనాల ఇంజన్లు, కుర్చీలు, ప్లాస్టిక్ బ్యానర్ల బ్యాగులు వంటి నిరుపయోగంగా ఉన్న వస్తువులను మూత్రశాల గదిలో పడేశారు. మూత్రశాలలో ఎటూ చూసిన పాన్‌మసాలతో గోడలపై ఉమ్మివేయడంతో దుర్గంధంగా తయారైంది. మూత్రశాలలకు వెళ్లాలంటే ముక్కు మూసుకోని పోవాల్సిన పరిస్థితి నెలకొంది.

కొండ గొర్రెను రక్షించిన అధికారులు



కొండ గొర్రెకు వైద్యం చేస్తున్న సిబ్బంది

ఆసిఫాబాద్‌రూరల్: కొండగొర్రెను రక్షించి అడవిలో వదిలిన సంఘటన మండలంలోని రవిచంద్రకాలనీ సమీపంలో చోటు చేసుకుంది. డిప్యూటీ రేంజర్ యోగేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం అడవిలో నుంచి దారితప్పి రవిచంద్రకాలనీకి సమీపంలోకి రావడంతో గ్రామస్తులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. అధికారులు అక్కడికి చేరుకుని కొండగొర్రెను రక్షించారు. కాలుకు గాయం ఉండటంతో పశువైద్య ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. అనంతరం సిబ్బంది అడవిలో వదిలేశారు. ఎక్కడైన అడవి జంతువులు గ్రామాల వద్దకు వస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని యోగేశ్ సూచించారు. కార్యక్రమంలో అటవీ సెక్షన్ అధికారి మహేందర్, బీట్ అధికారులు సాధిక్ పాషా, కిషోర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు చోరీ



దొంగతనం జరిగిన తీరు పరిశీలిస్తున్న పోలీసులు

పెంచికల్‌పేట్: మండలంలోని చేడ్వాయి ప్రధాన రహదారి సమీపంలోని పంట చేలలో వ్యవసాయ మోటర్ల విద్యుత్ తీగలను గుర్తు తెలియని దుండగులు ఆదివారం చోరీ చేశారు. రైతులు బండి రాజేంద్రప్రసాద్, బోయిరె జై, బెడద స్వామిలకు చెందిన విద్యుత్ తీగలను దొంగిలించి సమీపంలోని పంట చేలలో కాల్చి కాపర్ వైర్లను ఎత్తుకెళ్లారు. బాధిత రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలను నమోదు చేసుకున్నారు.

క్రీడాప్రాంగణాల్లో పిచ్చిమొక్కలు



ఈ చిత్రంలో కనిపిస్తున్న క్రీడా ప్రాంగణం మండలంలోని ఝరి గ్రామానికి చెందినది. గ్రామంలో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేసినప్పటి నుంచి నిరుపయోగంగానే ఉంది. అసలు క్రీడా ప్రాంగణం ఉన్నట్లు కూడా చాలా మందికి తెలియదు. ప్రాంగణానికి వెళ్లడానికి ప్రత్యేక దారి లేదు. పాఠశాల ఆవరణ దాటి వెళ్లాల్సి ఉంటుంది. పాఠశాల వేళల్లో గేటు తెరిచి ఉన్నప్పటికీ సెలవు రోజుల్లో గేటు మూసే ఉంటుంది.



పిచ్చిమొక్కలతో నిండిన క్రీడాప్రాంగణం

- వసతుల్లేక యువత దూరం
- మండలంలో 93 క్రీడాప్రాంగణాలు
- 115 గ్రామాల్లో 2,136 మంది క్రీడాకారులు
- నిరుపయోగంగా క్రీడాసామగ్రి

కెరమెరి: యువతలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికి తీసి వారిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం గ్రామాల్లో, పట్టణాల్లో ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగణాలు చాలా చోట్ల వసతులు లేక పిచ్చిమొక్కలతో నిరుపయోగంగా మారాయి. కొన్ని చోట్ల క్రీడామైదానాల బోర్డులు మాత్రమే దర్శనమిస్తున్నాయి. పలుచోట్ల వాహనాలు, యంత్రాలను నిలిపేందుకు ఉపయోగిస్తున్నారు. నిర్మాణమే తమ వంతు అనుకున్న ప్రభుత్వం నిర్వహణ చూడకపోవడంతో అవి అలంకారప్రాయంగా మారాయి.

ఊరికి దూరంగా ఏర్పాటు..

మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో 93 క్రీడా ప్రాంగణాలు మంజూరయ్యాయి. వీటిలో వినియోగించేందుకు గతంలో క్రీడా సామగ్రి సైతం మంజూరు చేసింది. అందులో క్రికెట్ కిట్లు 94, వాలీబాల్ 94, సైకిల్ పంప్ 94, డంబుల్ 94, రింగ్స్ 94, స్కిప్పింగ్ రోప్ 94, ప్లాస్టిక్ విజిల్ 94, టీషర్టులు 7050 మంజూరయ్యాయి. అందులో ఒక్క క్రికెట్ కిట్టు ఖరీదు రూ.50 వేలు ఉండడం గమనార్హం. మండలంలోని 115 గ్రామాల్లో 2136 మంది క్రీడాకారులు ఉన్నారు. ఒక్కో గ్రామ పంచాయతీకి 3 కిట్లను ఇచ్చారు. ఒక్కో చోట మైదానం ఏర్పాటుకు సుమారు రూ.75 వేలు ఖర్చు చేసినట్లు అంచనా. స్థలం లేని చోట్ల ఒక క్రీడా మాత్రమే ఆడే అవకాశం ఉన్నట్లు క్రీడాప్రాంగాణాలను చూస్తే తెలుస్తోంది. చాలా చోట్ల ఊరికి దూరంగా ఉండడంతో మైదానాలు ఎందుకు పనికి రాకుండా పోతున్నాయి. ఇంత మంది క్రీడాకారులు ఉన్నప్పటికీ వారు ఆయా క్రీడాప్రాంగణాల్లో ఆటలు ఆడడం లేదు. వసతుల లేమి కారణంగా ఆడలేకపోతున్నట్లు క్రీడాకారులు పేర్కొంటున్నారు.

కానరాని సామగ్రి..



గతంలో క్రీడాకారులకు అందించిన క్రీడా పరికరాలు

గతంలో ఉన్న ప్రభుత్వం క్రీడాకారులు ఆడేందుకు పలు రకాల కిట్లను సైతం అందించినప్పటికీ అవి ఎక్కడున్నాయో ప్రస్తుతం ఎవరికీ తెలియదు. క్రీడా సామగ్రి తీసుకున్న వారు సైతం 10శాతం కూడా క్రీడా ప్రాంగణాల్లో ఆటలు ఆడడంలేదని సమాచారం. దీనికి కారణం అనువైన స్థలం లేకపోవడమే కాకుండా ఊరికి దూరంగా ఉండడం కూడా మరో కారణంగా చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు వసతులు కల్పించి యువతకు చేయూత ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం



క్రీడాప్రాంగణాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరిస్తాం. క్రీడాకారులను అన్ని విధాలుగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. గతంలో క్రీడాకారులకు వివిధ రకాల కిట్లను అందించాం. వానాకాలం ముగియగానే క్రీడా ప్రాంగణాలు వినియోగంలోకి తీసుకొస్తాం.

– ఎండీ అంజద్ పాషా, ఎంపీడీవో

ఆగిన ఆర్టీసీ సేవలు..!

- గుంతలమయంగా తుమ్మిడిహెట్టి రోడ్డు
- ఆర్టీసీ బస్సు సేవలు నిలిపివేసిన అధికారులు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, ప్రజలు

కౌటాల: మండలంలోని పలు గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రం నుంచి మండలంలోని మొగడ్‌దగడ్, తాటినగర్, బాలేపల్లి, వీర్దండి, గుండాయిపేట్, తుమ్మిడిహెట్టి గ్రామాలకు ఆర్టీసీ బస్సు సేవలు నిలిపివేయడంతో ఆయా గ్రామాలకు వెళ్లేందుకు ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. తారురోడ్డు మార్గం ఉన్నా ఆర్టీసీ అధికారులు ఈ మార్గంలో బస్సు సేవలు నిలిపివేయగా ప్రజాప్రతినిధులకు తెలిసినా పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గుంతల రోడ్డు..

కౌటాల మండల కేంద్రం నుంచి మొగడ్‌దగడ్, తాటిపల్లి, బాలేపల్లి, వీర్దండి, గుండాయిపేట, తుమ్మిడిహెట్టి గ్రామ పంచాయతీలతో పాటు పలు గ్రామాలకు వెళ్లే ప్రధాన తారురోడ్డుపై భారీ గుంతలు ఏర్పడడంతో ఆయా గ్రామాలకు వెళ్లేందుకు ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. రోడ్డు పూర్తిగా ధ్వంసమై గుంతలు ఏర్పడడంతో ఆర్టీసీ బస్సు ఈ మార్గంలో వెళ్లిన ప్రతీసారి బస్సు మరమ్మతులకు గురవుతుందని, నెల రోజుల క్రితం ఆర్టీసీ అధికారులు ఆ మార్గంలో బస్సు సేవలు నిలిపివేశారు. దీంతో గ్రామీణ ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. కాగజ్‌నగర్ నుంచి కౌటాల మీదుగా తుమ్మిడిహెట్టి వరకు ప్రతీరోజు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం బస్సు సేవలు మూడుసార్లు కొనసాగేవి. ఈ మార్గంలో ప్రైవేట్ పాఠశాలల బస్సులు యథావిధిగా నడుస్తున్నాయని, ఆర్టీసీ అధికారులు బస్సు మరమ్మతులకు గురవుతుందనే కారణంగా సేవలు నిలిపివేయడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రైవేట్ వాహనాల్లో..

ఆయా గ్రామాలకు బస్సు సేవలు నిలిచిపోవడంతో ఆటోల ద్వారా స్థానికులు ప్రయాణం సాగిస్తున్నారు. గ్రామాల నుంచి మండల కేంద్రానికి, ఆయా గ్రామాలకు వెళ్లి రావడానికి సమయానికి ఆటోలు కూడా రాక చాలా కష్టాలు పడుతున్నామని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయా గ్రామాల నుంచి రోజూ ఎంతో మంది విద్యార్థులు ఇంటర్, డిగ్రీ చదువుల కోసం మండల కేంద్రానికి వస్తుంటారు. ఆర్టీసీ బస్సులు లేక విద్యార్థులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి ఆయా కళాశాలలకు ఆలస్యంగా చేరుకోవాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయని విద్యార్థులు వాపోతున్నారు. బస్సు పాసు ఉన్న విద్యార్థులు కళాశాలలకు వెళ్లలేక ఇళ్లకే పరిమితమవుతున్నారు. రోడ్డుకు మరమ్మతులు చేయడంతో పాటు ఆర్టీసీ బస్సు సేవలను కొనసాగించాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.



బస్సు కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు

బస్సు సేవలు కొనసాగించాలి



మా గ్రామానికి ఎన్నో ఏళ్లుగా ఆర్టీసీ బస్సు సేవలు కొనసాగుతున్నాయి. గత నెల రోజులుగా రోడ్డుపై గుంతలున్నాయని అధికారులు బస్సు సేవలు నిలిపివేశారు. దీంతో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నాం. ఆర్టీసీ అధికారులు స్పందించి తుమ్మిడిహెట్టి రూట్‌లో ఆర్టీసీ బస్సు సేవలను కొనసాగించాలి.

– బోయర్ రాధేశ్యాం, గుండాయిపేట

'గిరి' గ్రామాల్లో సిగ్నల్ తిప్పలు

పెంచికల్‌పేట్: మండలంలోని మారుమూల గిరిజన ప్రాంతాల్లో ప్రజలు సెల్‌ఫోన్ సిగ్నల్స్ కోసం తిప్పలు పడుతున్నారు. మురళీగూడ, జిల్లెడ, నందిగామ, గుండెపల్లి, కమ్మర్‌గాం గ్రామాలకు చెందిన ప్రజలు సిగ్నల్స్ కోసం ప్రతీరోజు గ్రామాల సమీపంలో ఉన్న ఎత్తయిన గుట్ట ప్రాంతాలకు చేరుకుంటున్నారు. అత్యవసర సమయంలో సెల్‌ఫోన్ సిగ్నల్స్ లేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు

ఇంద్రవెల్లి: కేస్లాపూర్ నాగోబా ఆలయంలో ఈనెల 29న నిర్వహించే నాగుల పంచమి పూజలు చేసేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తామని మెస్రం వంశం పెద్దలు మెస్రం కోసేరావ్, మెస్రం సోనేరావ్, శేఖరాబాబు, దేవ్‌రావ్‌లు అన్నారు. ఆదివారం మండలంలోని కేస్లాపూర్ నాగోబా ఆలయంలో సమావేశమై నాగులు పంచమి రోజు నిర్వహించే మినీ జాతర ఏర్పాట్లు, భక్తుల సౌకర్యాలపై చర్చించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి నాగోబా ఆశీస్సులు పొందాలన్నారు. కార్యక్రమంలో మెస్రం వంశీయులు మెస్రం శేక్‌నాథ్, మెస్రం మానిక్‌రావ్, తదితరులు పాల్గొన్నారు.

గుమ్నూర్(బి) గ్రామం నుంచి పట్కల్‌మంగి రహదారి పరిస్థితి



రాముునాయక్ తండా నుంచి ఎల్లాపట్టార్ గ్రామం వరకు రోడ్డు దుస్థితి



గ్రామాలకు రోడ్ల తిప్పలు

- చిన్న వర్షం కురిసినా బురదమయం
- గుంతలు పడి అధ్వానం
- అత్యవసర సమయాల్లో ఇబ్బందులు

లింగాపూర్: మండలకేంద్రం నుంచి వివిధ గ్రామాలకు వెళ్లే రోడ్లు గుంతలతో నిండి అధ్వానంగా మారాయి. మండలంలో వారం నుంచి కురుస్తున్న వర్షాలతో గుంతల్లో నీరు నిలిచి రోడ్లన్నీ బురదమయంగా మారుతున్నాయి. మండల కేంద్రం సమీపంలోని పెద్దవాగు వద్ద అసంపూర్తిగా వున్న బ్రిడ్జి వద్ద రోడ్డుపై గుంతలు పడటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. లింగాపూర్ నుంచి జాముల్‌ధరా, పూల్‌సింగ్ తండా, కీమానాయక్‌తండా, దంపూర్, ఎల్లాపటార్, పంగిడిమధరా, పట్కల్‌మంగి, వంకామద్ది, మోతీపటార్ వరకు ఉన్న రోడ్లు పూర్తిగా అధ్వానంగా మారాయి. రోడ్లపై ఉన్న గుంతల్లో వర్షం నీరు నిలిచి ప్రమాదకరంగా ఉన్నాయి. దీంతో ఈ రోడ్లపై వాహనదారులు వెళ్లాలంటేనే జంకుతున్నారు. గత ఏడాది కురిసిన వర్షంతో కిమానాయక్‌తండా బ్రిడ్జి వరదలతో కొట్టుకుపోయి చాలావరకు దెబ్బతింది. కాగా వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో పూర్తిగా దెబ్బతింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. అయినా గ్రామస్తులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని లింగాపూర్ వరకు ఈ మార్గంలో ప్రయాణం సాగిస్తున్నారు. కాగా లింగాపూర్ మండలం పిక్లాతండా గ్రామం నుంచి కొత్తపల్లి, గిరిజన తండాలకు వెళ్లాలంటే మట్టిరోడ్డే దిక్కు. గుమ్నూర్(బి) నుంచి వంకామద్ది (1), వంకామద్ది (2), మోతీపటార్, పట్కల్ మంగి గ్రామాలతో పాటు చోర్‌పల్లి గ్రామానికి అనుసంధానంగా ఉన్న గిరిజన గ్రామాలకు సైతం రోడ్డు సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అల్లిగూడ గ్రామం నుంచి కంచన్‌పల్లి వరకు, గోపాల్‌పూర్ నుంచి జాముల్‌ధర వరకు ఉన్న బీటీ రోడ్డు కంకర తేలి అధ్వానంగా మారింది. రోడ్డుపై గుంతలు ఏర్పడి ప్రయాణం ప్రమాదకరంగా మారింది. సంబంధిత శాఖల అధికారులు, పాలకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని రోడ్లకు, బ్రిడ్జీలకు మరమ్మతులు చేపట్టాలని మండలవాసులు కోరుతున్నారు.



గర్భిణిని ఆసుపత్రికి తరలిస్తుండగా బురదలో చిక్కుకున్న ఆటో

బురదమయంగా రోడ్లు..



మా గ్రామానికి రోడ్డు సౌకర్యం లేక అత్యవసర సమయాల్లో ఇబ్బందులు పడుతున్నాం. మండలంలో చిన్న వర్షం కురిసినా రోడ్లన్నీ బురదమయంగా మారుతున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు.

– జాదవ్ రవీందర్, పట్కల్‌మంగి

అధికారులు స్పందించాలి



ఇప్పటికీ మండలంలోని గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం కరువైంది. మండల కేంద్రం నుంచి చుట్టుపక్కల దాదాపు 20కి పైగా గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలి.

– జోటోత్ రాహుల్, లింగాపూర్

నాడు వెలవెల..నేడు జలకళ

దహెగాం: వర్షాకాలం ఆరంభ సమయంలో భారీ వర్షాలు లేక ప్రాజెక్టులు, చెరువులు వెలవెలబోయాయి. నాలుగు రోజులుగా కురుస్తున్న ముసురు వర్షాలతో వరద నీరు ప్రాజెక్టులకు చేరడంతో జలకళ సంతరించుకుంది. ఈనెల 9న నీరు లేక వెలవెల బోయిన పీపీరావు ప్రాజెక్టు ప్రస్తుతం వర్షాలకు నీటితో నిండిపోయింది. ప్రాజెక్టు సామర్థ్యం 147.5 మీటర్లు కాగా ప్రస్తుతం 146.9 మీటర్లుగా ఉంది.



ఈనెల 9న వెలవెలబోతున్న పీపీరావు ప్రాజెక్టు



ఆదివారం జలకళతో పీపీరావు ప్రాజెక్టు

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ పట్టణంలోని బాలభారతి పాఠశాల పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఆదివారం కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో జరిగింది. 2000–01 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఒకేచోట కలుసుకుని వారి అనుభవాలు పంచుకున్నారు. విద్య నేర్పిన ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. 25 ఏళ్ల తర్వాత ఒకే వేదికగా విద్యార్థులు కలిసి వారి చిన్ననాటి విషయాలు గుర్తుచేసుకున్నారు. వివిధ రంగాల్లో ఉన్నత స్థాయిలో ఉన్న విద్యార్థులను చూసి ఉపాధ్యాయులు మురిసిపోయారు. అంతకు ముందు పాఠశాల ప్రధానోపాధ్యాయులు స్వర్ణలత పూర్వ ఉపాధ్యాయులతో కలిసి జ్యోతిప్రజ్వలన చేశారు. అదేవిధంగా పాఠశాలలో పనిచేసి ఇటీవల మృతి చెందిన పలువురు ఉపాధ్యాయుల మృతికి మౌనం పాటించి నివాళులర్పించారు. కార్యక్రమంలో బాలభారతి పాఠశాల కోఆర్డినేటర్ వసీం, ఉపాధ్యాయులు రాజేంద్రప్రసాద్, షణ్ముఖ చారి, స్వర్ణలక్ష్మి, పైడి సంతోష్, గోవింద్‌రావు, గంగాధర్‌రావు, ఓంప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.



అపూర్వ సమ్మేళనంలో ఉపాధ్యాయులతో విద్యార్థులు